అష్టమ సర్గ

[కథానకము]

❁

— శ్రీ శివశంకరశాస్త్రి —

వర్షము కురవడము లేదు. కాని పశ్చిమదిక్కునుంచి ఆర్ద్రవాయువు వీస్తున్నది. త్వరలోనే వాన పడుతుంది. ఆకాశాన త్వరత్వరగా పోతున్న మేఘాలు నిండుగా ప్రవహిస్తున్న సిప్రానదీవక్షముమీద ధూసరచ్ఛాయ వేస్తున్నవి. సిప్రానదీ తూర్పుఘట్టమున అనేకశిలా సోపానములు కట్టి ఉన్నవి. వాటిపక్కన జలధార నదీగర్భాన ప్రవేశిస్తున్నది. అక్కడ నీరు సుడి తిరుగుతున్నది.

ఘట్టాన ఎవరూ లేరు. మరొక రోజున అయితే స్నానముచేసే స్త్రీలగుంపు కనబడేదే. ఇంతలో ఒకానొక యువతి వచ్చి ఆకాశమువంక చూసి కలశము నిండా నీరు నింపుకొని తొందరగా వెళ్ళిపోతున్నది. ఒక కన్య మంజీరములు మోగుతుండగా పాదన్యాసము చేస్తూ వేగిరము స్నానముచేసి పూర్ణ ఘటము చంకన ఎత్తుకొని సోపానము లెక్కి వెళ్ళిపోతున్నది.

ఒకానొక పురుషుడు జలపాతము దగ్గిర చింతామగ్నుడై కూర్చున్నాడు. అతనికి రమారమి ముప్ఫయి అయిదు సంవత్సరా లుంటవి. శరీరము కరిగిపోసిన బంగారమువలె ఉన్నది. యజ్ఞోపవీతము కనబడుతున్నది. లలాటమున ధవళచందన త్రిపుండ్రము. మేఘచ్ఛన్నమైన ఆ వర్షాసంధ్యాకాలపు మసకలోకూడా ఖడ్గము వంటి అతని నాసిక, విశాల నేత్రములూ కనిపిస్తూనే ఉన్నవి. ఆయన మధ్యమధ్య ఆకాశముకేసీ, నదీతరంగములకేసీ చూస్తున్నాడు.

అతని ముఖము చింతాక్రాంతము. రెండురోజుల నుంచీ ఒక జటిలప్రశ్నకు సమాధానము దొరకక ఆయన ఆలోచనలో పడ్డాడు. అలంకారశాస్త్రము తిరగవేసినాడు, సమాధానము రాలేదు. అవంతీ ప్రభువూ, ఆయన పరిషత్సభ్యులైన రసికులూ సమాధానముకోసము వ్యగ్రతతో ప్రతీక్షిస్తున్నారు. అతని ఔదాసీన్యమూ, పరధ్యానమూ చూచి ఇల్లాలు సందిగ్ధమనస్కురాలు అయింది. ఆమెకు వివిధ చింతలవల్ల రాత్రి నిద్ర పట్టలేదు.

ఇంతలో కొంతమంది కోమలాంగులు మంజీర ధ్వనులతో సోపానాలు దిగినారు. అతనిని గమనించలేదు. ఉత్తరీయములూ, కలశములూ మెట్లమీద ఉంచి నీళ్ళలో దిగి జలక్రీడ చేస్తున్నారు. కొంచెము దూరములో ఉన్న ఆ పురుషుడు ఉలికిపడి వారివైపు చూచి తల వంచుకొని వారి ఆలాపములు వింటున్నాడు.

"నిన్న మీఆయన దేశాంతరమునుంచి వచ్చాడు. కాబట్టి..." మిగిలిన పలుకులు హాస్యధ్వనులలో లీనమైపోయినవి.

"ఏమిటే, ఏమిటె, ఏ మయింది!"

"ఏమీ లేదు. చెప్పను!"

"...పాపం, లోలకు ఎంతకష్టం! ఆమె భర్త ఇంతవరకూ తిరిగి రాలేదు. ఎవరికి తెలుసు! యవద్వీపము ఎంతదూరమో చెప్పగలవా?"

"సింహళము దాటిపోవాలి. ఆరుమాసాల ప్రయాణము. కష్టం వేస్తుంది లోలకోసము!"

"చూడు, మేఘాలు తూర్పుగా కదులుతున్నవి."

"అవును. ఇవి అలకానగరము వెళ్ళవు."

పురుషుడు చెవులు నిక్కించి వారిమాటలు వినడానికి యత్నించినాడు. కాని అట్టే వినబడలేదు. యువతులు స్నానాలు చేసి సోపానాలు ఎక్కినారు.

అందులో ఒక తరుణి పురుషుని గుర్తుపట్టి చప్పున వస్త్రము చుట్టుకొని "మయూరికా, ఒక్కమాటు ఇలా రావే" అన్నది.

ఉలికిపడి అందరూ అటు చూచి కొంచెము సిగ్గుపడినారు. ఉత్తరీయాలు గబగబ కప్పుకొన్నారు.

మయూరిక మందరస్వరాన పురుషుని పేరు ఉచ్చరించింది. నిముషములో కనుసంజ్ఞ జరిగింది. తర్వాత తరుణులంతా శాంతంగా ఆయనదగ్గిరికి వెళ్లి నిలుచున్నారు.

"భట్టమహాశయులు మా అందరి ప్రణామాలు స్వీకరింతురుగాక !" అని మయూరిక చేతులు జోడించింది.

"ఆయుష్మతీ భవ ! మీ రందరూ ఏదో అనుకొంటున్నారే" అని భట్టు చిరునవ్వుతో అన్నాడు.

యువతులు ఒకరి ముఖము ఒకరు చూచుకొన్నారు. ఆ మాటలు పురుషునికి— అందులో భట్టమహాశయునికి, చెప్పడము ఎలాగు ?

అందరిలో కాస్త ప్రగల్భురాలయిన మంజరిక కౌతుకచంచలదృష్టితో చూచి "భట్టమహాశయా, ఈవేళ మేఘాలు తూర్పుదిక్కుగా వెళ్లుతున్నవి. ఉత్తరాన ఉన్న అలకానగరికి వెళ్ళవని ఆక్షేపిస్తున్నాము" అన్నది.

"అందుకోసము ఆక్షేపించాలా ?"

"యక్షపత్ని విరహవేదనతో కాలము గడుపుతున్నది. యక్షుని వృత్తాంతము తెలియలేదు. అందుకని—"

"మీరు మేఘదూత కావ్యముసంగతి అంటున్నారు. మంచిది; కావ్యశిల్పములో చతురురాండ్రవలె కనబడుతున్నారు. నా ప్రశ్నకు సమాధానము చెపుతారా ?"

"సెల వియ్యండి" అన్నారు చేతులు జోడించి అందరూ. భట్టు ఆలోచించి శిరఃకంపము చేసి "అది చాలా కఠిన ప్రశ్న. మీరు చెప్పలేరేమో" అన్నాడు.

"అయినా సెల వియ్యండి ఆర్యా !" అని మంజరిక అనునయముతో అన్నది.

"మంచిది. వినండి. కావ్యములో నాయికానాయకులకు వివాహము సమకూడితే, కవి ఇంకా చెప్పవలసినది ఏ మయినా ఉంటుందా ?"

భట్టుమాటలకు అందరూ ఆశ్చర్యముతో నిశ్శబ్దముగా ఉండిపోయినారు. తమవంటి అపరిణతబుద్ధులయిన యువతులను కావ్యమీమాంసావిషయమై ఆయన అడుగుతాడని వారు భావించలేదు.

చివరకు మయూరిక మెల్లిగా "ఆర్యా, నాయికానాయకుల సమ్మేళనము కాగానే కావ్యము సమాప్తమయినట్టే. ఆ తర్వాత కవి చెప్పవలసినది ఏముంటుంది ?" అన్నది.

"నేను సమ్మేళనముసంగతి చెప్పలేదు. వివాహము మాట అన్నాను" అని భట్టు భేదము నిరూపించినాడు.

మంజరిక ఆశ్చర్యముతో "రెండూ ఒకటే కాదా ?" అన్నది.

"ఇదే ప్రశ్న !" అన్నాడు భట్టు చిరునవ్వుతో.

యువతులు అతని భావములో మర్మము గ్రహించలేక మౌనము వహించారు. భట్టు బొమలుముడిచి చింతాన్వితు డయినాడు.

అందరిలోకీ చతురురాలయినది అరుణిక. ఇంతవరకూ ఏమీ మాటాడనిది, ఇప్పుడు ముఖము తిప్పి "భట్టమహాశయా, ఈ మాట భట్టిని మహాశయను ఎన్నడూ అడగలేదా ?" అన్నది.

భట్టు కొంచెము అదురుతో ఆమెకేసి చూచాడు. ఆమె శోణాధరముమీద మందహాసరేఖ ఆడుతున్నది.

"లేదు. ఆమెను అడిగినట్టు జ్ఞాపకములేదు. ఈవేళ ఇంటికి వెళ్ళిన తరువాత అడుగుతాను. మీరు విలంబము చేయకండి. ఇళ్ళకు వెళ్ళండి. పొద్దు పోతున్నది" అన్నాడు భట్టు.

ఇందులో వక్రోక్తి అందరికీ గోచరించలేదు. అరుణికమాత్రము గ్రహించింది. భట్టు మృదువుగా అప్పు తీర్చినాడని తెలుసుకొన్నది.

అంతట యువతులు చేతులు జోడించి "ఆర్యా, ఆశీర్వదించండి" అన్నారు.

భట్టు నవ్వి "ఏమి ఆశీర్వదించను! నేను శంకర కింకరుడను. స్వయంగా శంకరుని శత్రువు మీకు సహాయుడు! మంచిది. ఆశీర్వదిస్తాను" అని క్షణము సేపు ఆగి, మేఘగంభీరస్వరముతో "మా భూ దేవం క్షణమపి చ తే స్వామినా విప్రయోగః!" అని పలికినాడు.

కపోతహస్తములతో అందరూ ఆశీర్వచనము శిరసా వహించారు; ప్రఫుల్ల హృదయాలతో ప్రీతి ప్రముఖముఖములతో శ్రోణీకలశభారమంథరగమనములతో బయలుదేరినారు.

౨

భట్టు అక్కడనే కూర్చున్నాడు. యువతుల నూపురధ్వనులు క్రమక్రమంగా చెవికి దూరమయిపోయినవి. భట్టు మళ్ళీ ఆలోచనాపరుడయినాడు. ఏమి చెయ్యవలె? నాయికానాయకుల వివాహముతో కవి కర్తవ్యము పూర్తి అవుతుంది. కాని అతని మనస్సు కుదుటపడలేదు. కావ్యము ముగిసింది. కవి ఇక కాస్త రచన చేసినా ప్రతిజ్ఞాభంగమవుతుంది. నాయిక ముఖాన లజ్జాన్వితహాసము అంకురింపజేయడము ఉచితము. అక్కడ ఆగితే రసభంగమయిపోతుంది. కవికి ఏమీ పాలుపోవడము లేదు.

పొద్దు పోతున్నది. సంధ్యావందనముసంగతి కవి మరిచిపోయినాడు. లేతామని భట్టు ఇటూ అటూ చూచినాడు. కలశము పట్టుకొని ఎవరో యువతి వస్తున్నది. ఆమెను చూచి భట్టు మళ్ళీ చలికిలబడినాడు.

ఆ తరుణి విచారముతో నడుస్తున్నది. ఆమెకు శరీరసౌభాగ్యముతప్ప అలంకారాలు లేవు. ఆమె తల దువ్వుకొనలేదు. మెలికగా చుట్టిన కేశపాశము బుజానవాలి ఉన్నది. కళ్లకు కాటుక లేదు.

భట్టు ఆమెను గుర్తు పట్టినాడు; చిన్నప్పటినుంచీ ఆమె బాగా తెలిసినదే. అయితే కొంతకాలమునుంచీ ఆ యువతి కనబడడము లేదు.

కవికళ్లు చెమ్మగిల్లినవి. "లోలా!" అని ఆమెను కవి పిలిచినాడు.

ఆ పిలుపువల్ల ఆమెమాంద్యము తొలిగింది. నెమ్మదిగా వచ్చి ఆమె కవిసమీపాన అధోముఖిగా నిలుచున్నది.

"నీవు నావిక రైవతకుని భార్యవు కావా?" అన్నాడు కవి. ఆమె తల యెత్తలేదు. పెదవులు కంపించినవి.

కవి మళ్ళీ ఆమెతో "నీ భర్త వరుణమిత్ర శ్రేష్ఠిని గతసంవత్సరము యవద్వీపానికి తీసుకువెళ్ళలేదా? ఇంకా రాలేదు కాదా?" అన్నాడు.

లోల కన్నులవెంట బాష్పాలు రాలినవి. ఆమె తల ఆడించింది.

భట్టు మందహాసముతో "భయము లేదు. రైవతకుడు క్షేమమే" అన్నాడు.

లోల విచారదృష్టితో అతని ముఖముకేసి చూచింది.

"ఈవేళ దర్బారుకు తెలిసింది; రైవతకుడు పడవలతో సాగరసంగమప్రదేశానికి వచ్చాడనీ, త్వరలోనే ఉజ్జయినికి వస్తాడనీ. నీవు నిశ్చింతగా ఉండు" అని అనునయవచనాలు పలికినాడు కవి.

లోల మెడకు కొంగు చుట్టుకొని, అశ్రువులు ఊరుతున్న నేత్రాలతో కవిని చూచి ప్రణామము చేసి గద్గదకంఠముతో "స్వామీ, తమకు మహాకాలస్వామి సమస్తజయములు ఇచ్చునుగాక!" అని దుఃఖము అణుచుకొని "ఈవేళ ఏమయినా వృత్తాంతము తెలిసినదా?" అన్నది.

"తెలిసింది."

"అంతా అపాయము లేకుండా ఉన్నారు గదా?"

"ఆ. లోలా, నీవు సాటి లేనిదానవు. రైవతకుడు వస్తే అతనిని నావద్దకు పంపించు. అతనికి నీ సంగతి చెపుతాను."

కన్నీరు తుడుచుకొని మందహాసముతో, అస్ఫుటస్వరముతో "చిత్తము" అన్నది లోల.

సన్నచినుకులు పడడము ఆరంభించినవి. భట్టు లేచి "లోలా, దుఃఖాంతమున సమ్మేళనము మధురము. నేను కుమారసంభవములో ఉమాదేవికి సమకూర్చిన దుఃఖాన్నిగురించి తలుచుకుంటే గుండెలు అదిరిపోతవి. చివరకు ఉమాదేవికి అభీష్టసిద్ధి అయింది. మదనుడు మళ్ళీ జీవము పొందినాడు. నీవుకూడా గౌరీదేవివలె సౌభాగ్యవతీ భవ! రేపు అమ్మవారికి పూజ చేయించు" అని సస్నేహముగా అన్నాడు.

లోల చేతులు జోడించి ఉన్నది. కవివాక్కులు బాగా గ్రహించలేకపోయింది. కాని ఆమెహృదయాన ఏదో చల్లదనమూ, సంతోషమూ ఆవహించినవి. భట్టు ఆమెశిరస్సుమీద హస్త ముంచి, ఆశీర్వదించి సోపానములు దాటి త్వరితముగా నడిచినాడు.

3

కవి కొంచెము దూరము వెళ్ళినాడు. నల్లరాతితో కట్టిన మహోన్నత ప్రాకారమూ, మహాకాలనాథ స్వామిమందిరశిఖరమూ ఎదురుగా కనబడినవి. నాలుగడుగులు వేసేసరికి మహాఘంటారవము వినబడ్డది. హారతివేళ అయింది. మందిరాంగణాన అనేకులు గుమిగూడి ఉన్నారు. కవి లోపలికి వెళ్ళకుండా అక్కడనుంచే భక్తితో చేతులు జోడించి ఇష్టదేవతాస్తుతి చేసినాడు. శంఖధ్వనులూ, ఘంటా నినాదములూ చెవులలో మోగుతున్నవి. కాలాగురుధూప, గుగ్గులు వాసనలు నాలుగుపక్కలా వ్యాపించినవి.

హారతి కాగానే కవి బయలుదేరినాడు. సన్నచినుకు పడుతునే ఉన్నది. చీకటి పడినది. మార్గాలకు ఇటూ అటూ ఉన్న మేడలలో దీపాలు వెలుగుతూ ఉన్నవి. అక్కడక్కడ తెరచిన వాతాయనములవెంట వెలుతురూ, జాతీ, కదంబ, కేతకీ, యూధికా మిశ్రమైన సువాసనలు పాంథులను పరవశులను చేస్తున్నవి. కవి నడిచిపోతున్నాడు.

ఉజ్జయినీ నగరములో మార్గములు చాలా సంకీర్ణములు. భట్టు పోయి పోయి, దీపోద్భాసిత సౌధ తోరణసమీపాన ఆగినాడు.

సింహద్వారానికి కొంత వెనుక నైపున పెద్ద సౌధము. దీపావళీ కాంతి అందులోనుంచి వస్తున్నది. అంగణములో పెద్దమనుషుల రథాలు, మేనాలు మొదలయినవి నిలిచి ఉన్నవి. సౌధములోనుంచి మధుర నాదములు వినబడుతున్నవి. ఈ వేళ ప్రియదర్శికా సౌధములో సమాపానక మనీ, తనకు ఆహ్వానము ఉన్నదనీ అతనికి జ్ఞాపకము వచ్చింది.

భట్టువదనము హర్షోత్ఫుల్ల మయినది. తన ప్రశ్నకు సమాధానము ఈ ప్రియదర్శిక వల్లనే రావాలి. ఆమె చతుష్షష్టికళలలో నిపుణురాలు. అలోకసామాన్య అయిన గణికామణి. తన రచనలలో ఉన్న రామణీయకము అందరికన్నా బాగా గ్రహించింది ఈ ప్రియదర్శిక. ఈమెవంటి కలాభిజ్ఞ అవంతీరాజ్యములో లేదు. మహామండలేశ్వరుడుకూడా ఆమె రూపముగ్ధుడు మాత్రమే కాక ఆమెరసికతకు ముఖ్యముగా ముగ్ధుడై ఆదరిస్తాడు.

భట్టు అంగణములో ప్రవేశించినాడు. అప్పుడు తన యిల్లాలు కనిపెట్టుకొని ఉంటుం దని జ్ఞప్తికి వచ్చి కొంచెము విషణ్ణు డయినాడు. తనభర్త ప్రియదర్శికా సౌధానికి వెళ్ళుతుంటా డని ఆమెకు అసంతృప్తి. అప్రియ వార్తలు వ్యాపనచేసేవారికి కొదవ లేదు. తన భర్తకూ, గణికకూ గూఢానురాగ మున్న దని ఆమెకు అనుమానము కూడా కలగక పోలేదు. గణిక పేరు వినబడితే ఆమెకు కష్టముగా ఉంటున్నది. అర్ధరాత్రమువరకూ భట్టు గణికాగృహములో జరిగే గోష్ఠిలో ఉండక తప్పదు. చాలా చిక్కు!

భట్టును ద్వారపాలికలు మధురకంఠాలతో "కవీంద్రా, స్వాగతము! పండితప్రవరా, లోపలికి దయ చెయ్యండి. ఆర్యప్రియదర్శిక తమ ఆగమనముకోసమై ఎదురు చూస్తున్నది. దయచెయ్యండి మహాభాగా! మీరు రాకపోవడముచేత సభానవరత్నమాలికలో నాయకరత్నము కొరతపడ్డది. స్వాగతము!" అని పలికినారు.

పాలిక లందరూ సుందరయువతులు, రసికలు. వారు పుష్పమాలికలతో, పూర్ణకుంభములతో, సుగంధద్రవ్యములతో నిలిచి ఉన్నారు. అతిథులను వారు

సమ్మానపూర్వకముగా ఆహ్వానిస్తారు. కవికి చాలా మధురముగా స్వాగతము చెప్పినారు. ఆయన గృహచింత మాని ఉల్లాసముతో లోపలికి బయలుదేరినాడు.

కవి కట్టిమసోపానము మీద నిలవగానే ఒక పరిచారిక ఆయనపాదాలమీద నీరు పోసింది. ఇంకొకతె పాద సన్నిధానములో కూచుని కాళ్లు కడిగింది. మరొకతె తెల్లని కార్పాసముతో పాదములు తుడిచింది. ఉజ్జయినీనగరములో ఈ కవీశ్వరునిమీద నాగరకులకు ఉన్న ఆదరానురాగములు మరియెవరిమీదా లేవు. ఆయన సేవాభాగ్యముకోసము అందరూ వ్యగ్రతతో ఉన్నారు.

చందనపు గిన్నె పనికత్తె అందించే సరికి కవి వేలితో గంధము తీసుకొని, లలాటమున తిలకము పెట్టుకొన్నాడు. ఒకతె పుష్పమాలిక కవి మెడలో వేసింది.

"సులోచనా, ఇది యేమి? నా మెడలో పూలదండ వేసినావే!" అన్నాడు కవి.

సులోచన కుటిలహాసముతో "కవీశా, ఇక్కడ మేమంతా ప్రియదర్శికా దేవి ప్రతినిధులము" అన్నది.

కవి చిరునవ్వుతో ఉద్యానము వెంట నడిచి సౌధములోకి వెళ్లినాడు. మొదట నాట్యశాల చూచి, అనంతరము వేతాళభట్టు కథ చెప్పుతున్న భవనము దాటి, కక్ష్యాంతరాలు గడిచి నీలచీనాంశుకము కప్పిన పీఠముమీద కూర్చున్న ప్రియదర్శికను చూచినాడు. ఆమెకు ఎదురుగా పీఠము మీద, వరాహమిహిరాచార్యుడు చేతులు తిప్పుతూ తీవ్రస్వరముతో మాటాడుతున్నాడు. ప్రియదర్శిక అతని ధోరణి తప్పించుకోలేక చిక్కున పడినట్టు కవి గ్రహించినాడు.

ప్రియదర్శిక కవిని చూచి మందహాసము చేసి కనుసైగతో ఆహ్వానించింది. ఆయన వారి వద్దకు వెళ్ళినాడు. కవి పురుషుని చూచి "ఏమిటి! వరాహ... మిహిర భట్టమహాశయులా!" అని, ప్రియదర్శికతో "ఈ జ్యోతిర్విశారదులు నీ భాగ్య విషయము తెలుపుతున్నారా?" అని మందహాసము చేసినాడు.

ప్రియదర్శిక కవిని అప్పుడే చూచినట్టు అభినయించి చప్పున లేచి ప్రణామము చేసింది. ఆమె కర్ణాభరణమైన నీలకాంతమణిభూషణము ఊగులాడింది. ఆమె మధురకంఠముతో "కాళిదాస కవీంద్రా, స్వాగతము! నేడు తమ పాదార్పణమువల్ల మా గృహము ధన్యమయింది. పీఠము అలంకరించండి ఆర్యమహాశయా! వకుళా, కవీంద్రునికి పానీయము పట్టుకు రావే!" అన్నది.

కాళిదాసు వరాహమిహిరభట్టుతో "ఆచార్యా, ఏమిటో ఆలోచన చేస్తున్నారే. జ్యోతిషవిషయమా? నా అదృష్టము ఎలా గున్నదో గుణించి చెప్పగలరా! ప్రస్తుతము చాలా చిక్కులో ఉన్నాను" అన్నాడు.

మిహిరుడు నవ్వి "కవీ, నీవు ఋతుసంహార కావ్యము ఒకటి యెలాగో రచించావు. నేను వివరిస్తున్న విషయాలు గ్రహించడానికి చాలా కష్టమయినవి సుమీ" అన్నాడు.

ఇంతలో వకుళ స్ఫటికపాత్రలో ఆసవము తెచ్చింది. ప్రియదర్శిక స్వహస్తాలతో అందించగా కవి పానీయము పుచ్చుకొని పాత్రిక పరిచారిక కిచ్చి "ఆచార్యా, ఎందుకు గ్రహించలేము? ద్వాదశరాసులు, ఇరవైయేడు నక్షత్రములు, నవగ్రహములు—వీటితో గదా వ్యాపారము?" అన్నాడు.

"మన అపౌరుషేయ శాస్త్రముమీద అర్వాచీన యావనికవిద్య బలాత్కారంగా వచ్చి కూర్చుంటున్నది. తికమక అవుతున్నది. భచక్రము రథచక్రము కాదు. గ్రహతారామండితవ్యోమము నిరంతరఘూర్ణమాన—"

కవి ఆచార్యుని మాటకు అడ్డుతగిలి "ఆచార్య మహాశయా, పొరపాటు! ఆకాశచక్రము నిజంగా రథచక్రమే. నిరంతరము తిరుగుతున్నా దానితోపాటు మనమూ తిరుగుతూ ఉన్నాము" అన్నాడు.

వరాహమిహిరుడు నవీనులను నిందిస్తూ మళ్ళీ ఉపన్యాసము ప్రారంభించినాడు. కాళిదాసు నెమ్మదిగా లేచివెళ్ళుతూ ఉంటే ప్రియదర్శిక కవివైపు దీనముగా చూచింది. గ్రహించి కవి వెడలిపోయినాడు. ఇంటికి పోదామా అనుకొంటున్న కాళిదాసుకు కక్ష్యాంతరములో అమరసింహుడు కనిపించినాడు. కవి అతని దగ్గిరికి వెళ్ళి "మహాశయా, ఒంటరిగా కూచున్నారేమి?" అని అడిగినాడు.

"ప్రియదర్శికతో మాటాడాలి. ఆ పాషండ మిహిరుడు ఆమెను విడిచిపెట్టకుండా ఉన్నాడు" అన్నాడు అమరుడు. కాళిదాసు ఆలోచించి "మహాశయా, నేను విడిచిపెట్టిస్తాను. పృథివికి ఆహ్నికగతి ఉన్నదని మీరు అంగీకరిస్తారా? చెప్పండి" అన్నాడు.

"పృథివికి ఆహ్నికగతి ఉండనీ, ఉండక పోనీ—"

"అలా కాదు. వరాహమిహిరభట్టు ఈ విషయము అంగీకరించడు."

"అలాగా! అయితే నేను తప్పకుండా విశ్వసిస్తాను!"

కాళిదాసు వెంటనే వరాహ మిహిరాచార్యుని వద్దకు వచ్చి "మాచారా! అమరసింహుడు ఆర్యభట్ట సిద్ధాంతము మంచిది అంటున్నాడు. పైగా ఆహ్నిక శబ్దము నూతనముగా అమరకోశములో చేరుస్తాడట. దానివల్ల ఆర్యభట్టసిద్ధాంతము—" అంటూ ఉంటే, వరాహ మిహిరుడు లేచి "ఉన్మత్తుడు! జడబుద్ధి! ఏడీ, ఎక్కడున్నాడు?" అని కేక వేసినాడు.

కాళిదాసు చిరునవ్వుతో కరసంజ్ఞతో గది చూపించగా వరాహమిహిరుడు గబగబ వెడలిపోయినాడు.

౪

ప్రియదర్శికా కాళిదాసులు అన్యోన్యముఖావలోకనము చేసినారు. ఉభయులకూ ఆంతరంగిక గ్రహణశక్తి ఉండడముచేత మాటాడకుండా ముఖావలోకనమువల్లనే పరస్పరభావములు ద్యోతకమవుతవి. కవిమనస్సులో ఉద్వేగము ఉన్నట్టు ప్రియదర్శికకు గోచరించింది. ఆ సంగతి ఎత్తకుండా ఆమె అస్ఫుట కాకలీస్వరముతో "కవీంద్రా, అబలావ్యథావిమోచనమువల్ల పుణ్యము కలిగితే, అది మీదే!" అన్నది.

కాళిదాసుహృదయములో అనిర్వచనీయశాంతి ఉదయించింది. ఈ గణికారత్నమును చూడడమువల్లనే ఆయన ప్రసన్నుడయినాడు. కవి పర్యంకముమీద అర్ధశయానుడయి ఆమెవంక చూచినాడు. ప్రియదర్శిక అతని బాహువులకింద ఉపధానములు ఉంచింది.

ఉభయులూ అభిముఖముగా పరస్పరము భావలోకనము చేసినారు. కవి శాంతచిత్తుడయినాడు. గణిక మాత్రము ఉపద్రవచలితచిత్త అయింది.

ప్రియదర్శిక అవనతవదన అయి తాంబూలకరండము కవిముందర పట్టి "భట్టినివిశేషాలేమిటి?" అన్నది.

కవి కొంచెము చలించి తాంబూలము గ్రహించి బొమముడిపాటుతో "భట్టినివిశేషాలు ఏమీ లేవు. ఆమె ఇంటిలోనే ఉన్నది" అన్నాడు.

ఏదో వ్యథాచ్ఛాయ ఆమెముఖాన క్షణమాత్రము గోచరించి వెంటనే తొలిగిపోయింది. గణిక మందహాసముతో "ఆహా, కవీశా, సపద్నీపవసు ధర మీ గుణగణముగ్ధ! కాని మీ గృహిణీమాత్రము మీ గుణగణాలు గోచరించలేదు" అన్నది.

"గోచరించలేదా! కాని ఆమె నన్ను—"

ప్రియదర్శిక అతని మాటకు అడ్డువచ్చి నిడుచూపు అతని ముఖాన నిలిపి కంఠాన వ్యథారేఖతో "నాకు అన్నీ తెలుసును కవీశా! నావద్ద గోపన ప్రయత్నమెందుకు?" అని, స్వరము మార్చి "ఆ సంగతి పోనివ్వండి— నేడు కవీశుని లలాటమున చింతారేఖ గోచరిస్తున్నదేమి? ఏ కావ్యము పూర్తి కావడానికి అట్టే విలంబము లేదని అందరినీ ఊరిస్తున్నారో ఆ కావ్యము పూర్తికాలేదా?" అని అడిగింది.

కాళిదాసు లేచి "ప్రియదర్శికా, చాలా చిక్కులో పడినాను! మూడురాత్రులు సరిగా నిద్ర లేదు. నీ సలహా కావాలి" అన్నాడు.

ప్రియదర్శిక ఆశ్చర్యముతో "ఏమి సంభవించింది?" అని ప్రశ్నించింది.

"నేను రచిస్తున్న కావ్యమును గురించి ఏమీ నిశ్చయము చెయ్యలేక పోతున్నాను. నీ ఆలోచన అవసరము."

ప్రీతితో ప్రియదర్శికవదనము ఉత్ఫుల్లమయినది.

"కవీశా, మీకు నేను ఆలోచన చెప్పవలెనా! ఎందుకు నన్ను సిగ్గుపాలు చేస్తారు!"

ప్రియదర్శికాజానువు అంగుళితో స్పృశిస్తూ కవి "అవంతీ రాజ్యములో నీకంటె ఎక్కువ రసాపవేత్త ఎవరు! చాలామంది మధురశబ్దముగ్ధులు బాహ్య

సౌందర్యోత్కృష్టుఁడు. రససాగరములో అడుగు ముట్టే వాడు లేడు—నీవు తప్ప!" అన్నాడు.

ఆనందబాష్ప పూర్ణ నేత్రములతో ఘటితాంజలితో ప్రియదర్శిక "కవీశా, మీ చిక్కు ఏమిటి? కావ్యము పూర్తి కాలేదా?" అన్నది.

"కావ్యము పూర్తి అయిందో కాలేదో తెలియడము లేదు."

"కావ్యము పూర్తి అయిందో కాలేదో మీకు తెలియడము లేదా? చాలా ఆశ్చర్యము!"

కాళిదాసు ఆమెదగ్గిరికి జరిగి ఆవేశముతో ఇలా పలికినాడు: "ఇంతవరకూ ఎవరితో చెప్పని విషయము నీకే ప్రథమతః చెపుతున్నాను. కావ్యనామము కుమారసంభవము. మహేశ్వరుడే కథానాయకుడు. పార్వతీదేవి నాయిక. కావ్యవిషయము తారకాసురుడు పెట్టేబాధలు పడలేక దేవతలు బ్రహ్మసన్నిధికి వెళ్ళినారు. మహాదేవుని ఔరసపుత్రుడు కుమారస్వామి తారకసంహారము చేస్తాడని బ్రహ్మ వారిని సంతోషపరచి పంపినాడు. సతీదేవి దేహత్యాగము చేసినతర్వాత మహేశ్వరుడు ధ్యానమగ్నుడయినాడు. సతి హిమవత్పుత్రికగా జన్మించి ఉమానామముతో పెరిగి పెద్దదయి, మహేశ్వరుడు తపస్సు చేస్తున్న ప్రదేశము చేరి పరిచర్యలు చేస్తున్నది. దేవతలు మహేశ్వరతపోభంగము చేయడానికి మదనుని నియోగించినారు. మన్మథుడు మహాదేవునికి కొద్దిగా చలనము కలిగించినాడు; కాని ఆ త్రినేత్రుని ఫాలాగ్నిలో భస్మమయినాడు. మహేశ్వరుడు ఆ ప్రదేశము విడిచిపెట్టి వెళ్ళినాడు. ఉమాదేవి మహేశ్వరప్రీత్యర్థము ఘోరతపస్సు చేసింది. ఆయన క్రమంగా సుప్రీతుడై ఆమెకు ప్రత్యక్షమయినాడు. తర్వాత యథావిధిగా వారికి వివాహమయినది."

ఇంతవరకూ చెప్పి కవి విరమించినాడు. ఏకాగ్రతతో వింటున్న ప్రియదర్శిక ముఖముపై కెత్తి చూచింది. మళ్ళీ కవి ఇలా అన్నాడు: "గౌరీశంకరుల వివాహముతో సప్తమసర్గ సమాప్తమయింది. నవవధూవదనాన లజ్జ అంకురించింది. మదనుడు ఉజ్జీవితుడయినాడు. కుమారసంభవ కావ్యములో ఏది ప్రతిపాద్యమో అది ప్రతిపాదితమయినది. కాబట్టి కావ్యకలానుగుణముగా గ్రంథము సమాప్తమయినట్టేనా?"

ప్రియదర్శిక ప్రత్యుత్తర మియ్యక అతనివంక చూస్తూ ఉన్నది. తర్వాత కవి "శాస్త్రానుసారముగా కావ్యము ఇంతటితో సమాప్తము కావడము ఉచితమనిపిస్తుంది. అయినా సందేహము వేధిస్తున్నది" అన్నాడు.

"ఏమని సందేహము?"

"కావ్యము ఎందుచేతనో కానట్టు. ఉమామహేశ్వరుల పూర్వరాగమూ, కల్యాణమూ వర్ణించినాను. కాని కావ్యానికి మూలభూతమైన కథ చెప్పనే లేదు. ప్రియదర్శికా, నీకు ఏమనిపిస్తున్నది? దేవదంపతుల వివాహానంతర జీవనము వర్ణించడము కావ్యకళాసంగతమేనా?"

"అలంకారశాస్త్రానుసారముగా కాదు. విషయాతిరిక్తవర్ణన వాగ్బాహుళ్య మంటారు. జగన్మాతృజగత్పితల దాంపత్యజీవనవర్ణన చాలా గర్హాలి మంటారు."

"అయితే, నీ మతప్రకారము వివాహముతో కావ్యము ముగించడము మంచిదన్నమాట."

ప్రియదర్శిక చెక్కిట చెయ్యి చేర్చి, కొంచెము సేపు ఆలోచించి "కవీశా, అలంకారశాస్త్రముకంటె సత్యమే ఘనమయినది. సత్యానుసరణములో శాస్త్రమును ఉల్లంఘించినా బాధ లేదు" అన్నది.

"ఇందులో ఏది సత్యమంటావు?"

"ఉమామహేశ్వరుల సమ్మేళనమే సత్యము."

"అది జరిగింది కదా?"

"జరిగిందా?"

"జరగలేదా?

"ఆవిషయము నేను చెప్పలేను. అది కవి ఆంతర్య విషయము."

కాళిదాసు కొంచెముసేపు ఆలోచించి "నా ఆంతర్యము నాకే తెలియలేదు. నీ అభిమతమేమిటో తెలియజెప్పు."

"నా అభిమతము వింటారా?" అంటూ ప్రియదర్శిక మందహాసము చేసింది.

"ఆ"

"మంచిది. మీరు ఇప్పుడు ఇంటికి వెళ్ళండి. ప్రొద్దు పోయింది. రేపు ఉదయానికి మీమనస్సులో ఇంకా సంశయము నిలవఉంటే, నాఅభిమతము తెలియజేస్తాను" అని ప్రియదర్శిక లేచి నిలుచున్నది.

కవికి కొంచెము నిరాశ కలిగింది. అయినా ఆయన ఏమీ అనలేదు. ప్రియదర్శిక కవిని తోరణము వరకూ సాగనంపి, సెలవు తీసుకొనేటప్పుడు "మిహిరభట్టు, అమరసింహులనుంచి దూరముగా ఉండి, కావ్యవిషయము ఆలోచించండి" అన్నది. ఉభయులూ నవ్వుకొన్నారు.

౫

కాళిదాసు ఇంటికి వెళ్ళేసరికి అర్ధరాత్రి కావచ్చింది. చీకటి. తలుపు వేసిఉన్నది. కవి జాగరూకతతో వినడానికి ప్రయత్నించినా ఏమీ వినబడలేదు. అంతా నిద్రపోతున్నారని తలుపు తట్టినాడు.

"ఎవరు?" అని లోపలనుంచి కంఠధ్వని.

"నేను—కాళిదాసును" అని కవి మందముగా అన్నాడు.

ఇంతలో తలుపు తెరిచినారు. భయపడుతూ కవి లోపల ప్రవేశించినాడు. స్వయముగా దీపము చేత పుచ్చుకొని గృహిణి యెదురుగా నిలుచుని ఉన్నది!

"వచ్చారా! ఇంత పొద్దుపోయేదాకా ఎక్కడున్నారు?" అన్నది భార్య.

కవి ఇంటిలోకి వెళ్ళి ఇలా అన్నాడు: "ప్రియే, నీవు ఇంతవరకూ మేలుకొనే ఉన్నావేమి? దాసితో-"

"మీరు ఇందాకా ఎక్కడున్నారు!" అని గృహిణి కఠినస్వరాన అడిగింది.

"గోష్ఠికి వెళ్ళాను."

ఇంతవరకూ అణుచుకున్నకోపము ఒక్కసారిగా పైకి ప్రజ్వరిల్లింది. నిప్పులు కక్కుతున్నకళ్ళతో కవిభార్య "ప్రియదర్శికయింటికి వెళ్ళారా! అలా చెప్పండి! సిగ్గు లేదు. చివాట్లు పెట్టేవాళ్లులేక! మీరు మహాపండితులే, రాజాస్థానకవులే, ధర్మనిరత బ్రాహ్మణోత్తములే, రాత్రి వేశ్యయింట్లో కాలయాపన చేశారా! సిగ్గు లేదూ చెప్పడానికి!" అన్నది.

"ప్రియే!—"

"ఛీ! నన్ను ప్రియా అని సంబోధించడానికి సాహసిస్తున్నారా! ఎవరు మీ ప్రియురాలు? నేను కాను. సహస్రభోగ్య ఆ ప్రియదర్శిక!"

కవి ఏమీ మాటాడకుండా నిలుచుని ఉన్నాడు. ఆయనమౌనము పత్నికోపానికి ఇంధన మయింది.

"ఛీ! లంపటా! ఎందుకు ఇంటికి రావడము? అక్కడే రాత్రి గడపవలసింది! వేశ్యాస్పర్శవల్ల అపవిత్రమైన భర్తశరీరము తాకితే కులాంగన మైలపడుతుంది. స్నానముచేస్తేకాని మళ్ళీ శుచికాదు. వెళ్లండి. మీకు ఇంట్లో ఏమి ప్రయోజనము! ఇంతసేపూ ఉన్నచోటికే దయచెయ్యండి!" అని కేకలువేసి కవిపత్ని శయనాగారములోకి వెళ్లి తలుపు బిగించుకొన్నది.

కవి చీకటిలో నిశ్చలముగా నిలుచున్నాడు. ఇది ఆయన యిల్లు. ఈమె ఆయనభార్య; గృహిణి, సచివ, ప్రియశిష్య! నిట్టూర్పు విడిచి కవి తాను కావ్యరచన చేసే గదిలోకి వెళ్ళి దీపము వెలిగించి పాదప్రక్షాళనాదికము చేసి మృగచర్మము పరుచుకొని కూర్చున్నాడు. కొయ్యపేటమీద పెట్టిన కుమారసంభవ గ్రంథముమీద అతని దృష్టి పడ్డది. వెంటనే మెరుపుతీగవలె భావము ప్రసరించింది. ప్రియదర్శిక చెప్పినమాట నిజమే. ఉదయానికి ఏమీ తోచకపోతే అప్పుడు ఆలోచన చెపుతానన్నది. ఇప్పుడు సంశయము తీరిపోయింది. భార్యతో ముఖాముఖి అయినమీదట అంధకారం తొలిగింది.

కవి లేచి దీపదండము తెచ్చి దగ్గరపెట్టుకొని తాలపత్ర గ్రంథసమేతముగా కొయ్యపేట ఎదుట ఉంచుకొని తర్వాత లేచి మసీపాత్ర, లేఖిని తెచ్చుకున్నాడు.

క్రమంగా కాళిదాసు ఆలోచనామగ్నుడయి లేఖిని గుప్పిట పట్టి, తాళపత్రమును పరీక్షించి నెమ్మదిగా "అష్టమ స్సర్గః" అని వ్రాసినాడు.

అనంతరము కాళిదాసు నిర్నిమేషనయనాలతో గవాక్షమువెంట చూచినాడు. వెలుపల చీకటి. టపటపమని చినుకులు పడుతున్నవి. అది వర్షఋతువయినప్పటికీ కాళిదాసుచిత్తములో వసంతఋతువు ప్రాదుర్భవించింది.

ఇంతలో కాళిదాస కవీంద్రుడు అవనతవదనుడై తాళపత్రముమీద వ్రాయ నారంభించినాడు. మందస్వరముతో లేఖిని తాళపత్రముమీద సాగిపోతున్నది.

"పాణిపీడనవిధే రనంతరం
శైలరాజదుహితు ర్హరం ప్రతి
*   *   *   *"

[వంగమాతృక ననుసరించి]